## సింగరేణి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులకు

# వ్యతిరేకంగా ప్రచారం

బొగ్గు గనుల తవ్వకాలకై సింగరేణి యాజమాన్యం ఉత్తర తెలంగాణ జిల్లాలలోని గోదావరినది తీర ప్రాంత గ్రామాలను, పట్టణాలను విధ్వంసం చేయడానికి ప్రణాళికలను రూపొందించి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల రూపంలో అమలు చేస్తున్నది. 'అధిక ఉత్పత్తి–అధిక లాభాలు' పేరుతో సింగరేణి యాజమాన్యం చేపడుతున్న ఈ విధ్వంసానికి ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నది. ఫలితంగా స్థానిక ప్రజలు పంట భూములను, నివాసాలను, బ్రతుకుదెరువును కోల్పోయి జీవించే హక్కును పోగొట్టుకుంటున్నారు.

గాలి, నీరు, నేల ప్రజల జన్మహక్కు అందుకే ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల ప్రణాళికలకు వ్యతిరేకంగా పోరాడటానికి ప్రజలు ముందుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

సింగరేణి బొగ్గు గనులు ఈ ప్రాంతానికి ఒకనాడు నిజంగానే అభివృద్ధిని తీసుకువచ్చాయి. సాగునీటి వసతి కరువై వ్యవసాయంలో చావలేక బ్రతుకుతున్న తెలంగాణ జిల్లాల పేద రైతులకు సింగరేణి బొగ్గు గనులు ప్రత్యామ్నాయ జీవనమార్గాన్ని చూపాయి. వేలాదిమంది బడుగు వర్గాల రైతు బిడ్డలు బొగ్గు గని కార్మికులైనారు. ఇల్లందు, కొత్తగూడెం, మణుగూరు, గోదావరిఖని, మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి వంటి పట్టణాలు వెలిశాయి. ఈ పరిణామాలు పరోక్షంగా లక్షలాది కుటుంబాలకు ఉపాధిని కూడా చూపించాయి. పల్లెల్లో దొరకని చదువు గని కార్మికుల పిల్లలకు ఇక్కడ దొరికింది. కొందరు తండ్రుల స్థానంలో పనులు పొంది సంతృప్తి చెందగా మరికొందరు ఉన్నత చదువులు చదివి బయటకు వెళ్లి మరింత బాగుపడ్డారు. మొత్తంమీద ఇది కొంత సమతుల్యంతో కూడిన అభివృద్ధిగా భావించవచ్చును. బొగ్గు గనుల తవ్వకాలు 'అండర్‌గ్రౌండ్' పద్ధతిలో సాగినందున చుట్టుప్రక్కల గ్రామాల వ్యవసాయంపై

పడిన దుష్ప్రభావం కూడా తక్కువగానే ఉండింది. ఒక్క రామగుండంలోనే గాక ఇతర ప్రాంతాలలో కూడా బొగ్గు ఆధారిత పరిశ్రమలు నెలకొల్పబడివుంటే స్థానిక ప్రజలకు మరింత మేలు జరిగిఉండేది. ఖనిజ సంపద, నీరు, చదునైన నేలలతో ఎన్నో పరిశ్రమల స్థాపనకు భౌగోళికంగా ఎంతో అనువుగా ఉన్నప్పటికీ 'తెలంగాణ వివక్ష'లో భాగంగానే ఇక్కడ పారిశ్రామికీకరణ నిర్లక్ష్యం చేయబడింది. పాలకులకు మొదటినుండి ఇక్కడి బొగ్గును కొల్లగొట్టుకుపోవడమే ధ్యేయంగా మారినందున ఇక్కడ జరగాల్సినంత అభివృద్ధి కూడ జరగలేదు. ఉత్తర తెలంగాణ జిల్లాలలోని బొగ్గు గనుల నుండి ఉత్పత్తి అవుతున్న బొగ్గు 80% స్థానికేతరంగా ఉన్న పరిశ్రమలకే తరలివెళుతుంది. స్థానికంగా ఉన్న పవర్ ప్రాజెక్టులకు 20% బొగ్గు వినియోగమే అవుతున్నా ఉత్పత్తి అయిన విద్యుత్ మాత్రం ఇతర రాష్ట్రాలకే వెళుతున్నది. (ఉదాహరణ రామగుండం ఎన్టీపీసీ) ఈ ప్రక్రియ అంతటిలో నష్టపోతున్నది మాత్రం బొగ్గు ఖనిజాన్ని తమ భూముల్లో కలిగివున్న ఉత్తర తెలంగాణ రైతాంగం మాత్రమే.

1990 లో కేంద్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ సామ్రాజ్యవాద అనుకూల నూతన పారిశ్రామిక విధానాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాలకు నమూనాగా మారిన తర్వాత సింగరేణి బొగ్గు గనుల్లో కార్మికుల స్థితిగతులు దిగజారగా బొగ్గు ఖనిజం కలిగిన గ్రామాల ఉనికి ప్రశ్నార్ధకంగా మారింది. సమతుల్యంగా జరగాల్సిన అభివృద్ధిని ధ్వంసం చేస్తూ వేగంగా బొగ్గు ఖనిజాన్ని తవ్వి తీసే ఆలోచన సింగరేణి యాజమాన్యంలోను వారి వెనకున్న ప్రభుత్వాలలోను మొలకెత్తింది. దానికి తగిన విధాన రచన (అధిక పెట్టుబడులు- కాంట్రాక్టర్లు - తక్కువ మంది కార్మికులు - అధిక ఉత్పత్తి) చేసి నడిపించగలిగే ఐఎఎస్ అధికారులు సింగరేణి సంస్థకు ఛైర్మన్‌లుగా, డైరెక్టర్‌లుగా పదవులు చేపట్టారు. కార్మికుల హక్కులను అణిచివేసి కార్మికుల చట్టాలను ఒప్పందాలను బేఖాతరుచేసి అధిక లాభాలను చూపిస్తున్నారు. అదే సమయంలో బొగ్గు దొరికే ప్రాంతాలలో ఉండే గ్రామాలను నాశనం చేసే 'బొగ్గు గనుల విస్తరణ-ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు'ల తవ్వకాలను చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలంలోని డోర్లి నుండి కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల గుండా పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి వరకు గోదావరి నది తీర గ్రామాలలో దాదాపుగా 70 ఓపెన్‌కాస్ట్ గనులను నెలకొల్పాలన్నదే బొగ్గు గనుల విస్తరణ ప్రణాళికావేత్తల సంకల్పం. అందులో భాగంగానే ఆదిలాబాద్ జిల్లాలోని కాశిపేట, శ్రావణపల్లి, ఇందారం, కరీంనగర్ జిల్లాలోని ఖమ్మంపల్లి, తాడిచర్ల, మహదేవపూర్, వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి, పెద్దాపురం వంటి గ్రామాలలో భూసేకరణ నోటిఫికేషన్‌లు జారీ అయినాయి.

రామగుండంలో ఇప్పటికే ప్రారంభమైన నాలుగు ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల వల్ల సమీప గ్రామాలలో భూగర్భ జలాలు అడుగంటడం, చెరువులు ఇంకిపోయి వ్యవసాయం కుంటుపడడం, భారీ బ్లాస్టింగ్‌ల వల్ల ఎగిసిపడే విషవాయువులు, దుమ్ము, ధూళి, గ్రామాల రహదారులు చెడిపోవడం, బ్లాస్టింగ్‌ల ప్రకంపనాలవల్ల ఇళ్లు కూలిపోవడం, భూనిర్వాసితులకు

ఉద్యోగాలు గాని నష్టపరిహారం గాని పూర్తి స్థాయిలో అందకపోవడంవంటి సమస్యలకు స్థానిక ప్రజలు గురవుతున్నారు. పర్యావరణానికి కూడా భారీ నష్టాన్ని కలుగజేస్తున్నాయి.

అయినాసరే మానవాళికి అన్ని రకాలుగా చేటుతెచ్చే ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల తవ్వకాలకే ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తూ ప్రజాభీష్టాన్ని కాలరాస్తున్నది. ఒక దగ్గర ప్రారంభమైతే అక్కడే ఉండే ప్రాజెక్టు కాదు. ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు, బొగ్గు పొరకు పైన ఉన్న మట్టిని అంతా తీసి ఆ మట్టిని వేరొకచోట కుప్పలుగా (గుట్టలుగా) పోయాలి. దానికి భూమి కావాలి, గని ముందుకు విస్తరించే క్రమంలో మళ్లీ భూమి కావాలి. ఈ విధంగా ఒక గ్రామంలో ప్రారంభమైన ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు క్రమక్రమంగా ఉత్తర తెలంగాణలోని గోదావరి తీర గ్రామాలన్నింటిని మింగుతుంది. ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు తవ్వకాలు ముగిసిన పిదప గనిలో ఇసుకను, మట్టిని నింపి పూడుస్తామని సింగరేణి అధికారులు చెబుతారు కాని భూమట్టానికి 300 మీటర్ల లోతువరకు జరిపే ఈ తవ్వకాల వల్ల ఏర్పడిన బొందను నింపడం సాధ్యంకాని పని. దేశంలో ఎక్కడా తిరిగి మట్టిని నింపిన దాఖలాలు లేవు. ఒకవేళ నింపినా 300 మీటర్ల లోతు నుండి మట్టి పొరలని కిందకు మీదకు అతలాకుతలం చేసిన తర్వాత ఆ భూమి దేనికి పనికొస్తుంది? అయినా ఆ భూమి తొలినాటి యజమానికైతే మళ్లీ దక్కదు. ఉత్తర తెలంగాణ జిల్లాలలోని గోదావరి నదీతీర ప్రాంత గ్రామాలు వ్యవసాయం, జనావాసాలతో నిండివున్నాయి. నిరుపయోగమైన స్థలం అంటూ ఏదీ లేనందున ఆ ప్రాంతంలో ఎక్కడ ఓపెన్‌కాస్ట్ తలపెట్టినా మానవ జీవన విధ్వంసం తప్పదు.

బొగ్గు గనుల తవ్వకాలు అండర్‌గ్రౌండ్ పద్ధతిలో సాగినపుడు వేల సంఖ్యలో స్థానికులకు ఉద్యోగాలు దొరికేవి. కాని ఓపెన్‌కాస్ట్ పద్ధతిలో ఉండే ఉద్యోగాలు తక్కువ. దాదాపు 70% పనులను కాంట్రాక్టర్లే నిర్వహిస్తున్నందున వారికి సంబంధించిన కాంట్రాక్టు కార్మికులనే తెచ్చుకుంటారు. స్థానిక గ్రామాల ప్రజలకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వరు. ఈ వైనాన్ని ప్రస్తుతం నడుస్తున్న ఓసిపిలలో చూస్తున్నాము. 300 మీటర్ల లోతులో బొగ్గు తవ్వకాలు జరపడం వల్ల గోదావరి నది ఇంకిపోయిన తీరం వెంబడి మట్టి గుట్టలు, బొందలు, బీడు పడిన భూములు మాత్రమే కనిపిస్తున్న ఓపెన్‌కాస్ట్‌ల వల్ల భూములు పోయి, ఊర్లు పోయి, బొగ్గు పోయి చివరకు మనకు తెలిసిన ఉత్తర తెలంగాణ కూడా మిగలదు.

ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి స్థానిక ప్రజల బాగోగులు పట్టవు. వారికి కావాల్సింది వార్షిక వృద్ధిరేటు. ఆదాయ వ్యయాల లెక్కల్లో అధిక ఉత్పత్తిని, అధిక లాభాల్ని చూపడం. గత సంవత్సరం దేశంలో అధిక ఆదాయ వృద్ధి రేటును సాధించిన వాటిలో రాజశేఖరరెడ్డిగారి ఆంధ్రప్రదేశ్ కూడా ఒకటి. ఈ ఘనతను ప్రతి సంవత్సరం పొందాలన్నది తప్ప వేరే దృష్టి ఆయనకు లేదు, ఆయన స్థానంలో రాబోయే వారికి కూడా ఉండదు. అభివృద్ధికి నిర్వచనం గనులను, భూములను కట్టకట్టి మూకుమ్మడిగా పారిశ్రామిక వేత్తలకు అప్పగించడమనే "రాజనీతి"ని పాలకులు అవలంబిస్తున్నంతకాలం ప్రజల భూములకు, జీవనోపాధికి, జీవించే హక్కుకు రక్షణ లేదు.

బలమైన ప్రజా ప్రతిఘటన ఒక్కటే ఉత్తర తెలంగాణ ప్రజల గ్రామాలని, వ్యవసాయాన్ని, బ్రతుకులని కాపాడగలుగుతుంది. అందుకు ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఓపెన్‌కాస్ట్ గనులకు వ్యతిరేకంగా

తలపెట్టిన యాత్రకు తమవంతు మద్దతును తెలిపి ఉత్తర తెలంగాణ గ్రామాల ప్రజల బ్రతికే హక్కును బలపరచమని కోరుతున్నాము.

పారిశ్రామిక అవసరాలకు కావాల్సిన బొగ్గు ఉత్పత్తికి మేము వ్యతిరేకం కాదు. పర్యావరణానికి, వ్యవసాయానికి, నివాసాలకు ఆటంకం కాకుండా బొగ్గు ఉత్పత్తి చేసే భూగర్భ విధానం ఉన్నప్పుడు ఓపెన్‌కాస్ట్ విధానం ఎందుకని ప్రశ్నిస్తున్నాము. బొగ్గు ఉత్పత్తి మరియు పంపిణీలో స్థానిక ప్రజలకు భాగస్వామ్యం, నిర్ణయాధికారాన్ని కల్పించి స్థానికుల అభివృద్ధికి ప్రాధాన్యతను ఇవ్వాలి. బొగ్గు ఆధారిత పరిశ్రమలను స్థానికంగా స్థాపించి స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాము.

ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల శాఖలు, 8-11-2008